నేడు ఇంటర్వ్యూలు

శంషాబాద్: రాజీవ్ యువ వికాస్ పథకానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకున్న వారికి ఈ నెల 27న కార్పొరేషన్ల వారీగా ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ బి.సుమన్‌రావు తెలిపారు. పూర్తి స్థాయి దరఖాస్తులు సమర్పించని అభ్యర్థులు సైతం దరఖాస్తు ఫారం, ఆధార్ కార్డు, రేషన్‌కార్డు లేదా ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు, రెండు ఫొటోలు, పాన్ కార్డులతో నేరుగా హాజరు కావాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కార్పొరేషన్ ఆధ్వర్యంలోని ఇంటర్వ్యూలు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలోని ఇంటర్వ్యూలు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటలకు నిర్వహించనున్నట్లు ఆయన వివరించారు.

ఎరువు తయారీ కేంద్రం సందర్శన



బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రిసోర్స్ పార్క్ కొత్వాల్‌గూడలో డ్రై రిసోర్స్ కలెక్షన్ సెంటర్, కంపోస్టు తయారీ కేంద్రాన్ని కమిషనర్ శరత్‌చంద్ర పరిశీలించారు. ప్రతి ఇంటి నుంచి సేకరించిన రోజువారీ చెత్తలో వచ్చిన పొడి చెత్తను రీసైకిల్ చేసి రీయూస్ చేయాలని ఆయన పేర్కొన్నారు. తడి చెత్తతో కంపోస్టు తయారు చేసి మొక్కలకు సేంద్రియ ఎరువుగా ఉపయోగించాలని సూచించారు. కార్యక్రమంలో శానిటరీ జవాన్లు నరేందర్, రాము, సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి నిధుల మంజూరు

బండ్లగూడ: అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ ప్రాధాన్యం ఇస్తున్నారని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ ఆల్ కాలనీస్ ఫెడరేషన్ సభ్యులు వినయ్‌రెడ్డి, నరేందర్‌బాబు అన్నారు. గంధంగూడ శ్రీనివాసనగర్ కాలనీలో నూతన సీసీ రోడ్డు పనుల కోసం రూ. 23 లక్షలు మంజూరయ్యాయి. నిధుల మంజూరు పత్రాన్ని కమిషనర్ శరత్‌చంద్రకు వారు అందజేశారు. పనులను త్వరగా నిర్వహించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. గోతులమయంగా మారిన రోడ్లపై ప్రయాణించేందుకు వాహనదారులు, పాదచారులు తీవ్ర అవస్థలకు గురవుతున్నారన్నారు. ఈ పనులు త్వరగా పూర్తి చేస్తే స్థానికులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

సర్వేయర్ల పాత్ర కీలకం



మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

శంషాబాద్ రూరల్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రూపొందించిన భూభారతి రెవెన్యూ చట్టం అమలులో సర్వేయర్ల పాత్ర కీలకమని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. మండల పరిధిలోని ముచ్చింతల్ శివారులో ఉన్న స్వర్ణ భారత్ ట్రస్టు ఆవరణలో సోమవారం లైసెన్సుడ్ సర్వేయర్లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన కలెక్టర్ వారిని ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా వారికి పలు అంశాల్లో దిశానిర్దేశం చేశారు. శిక్షణకు హాజరైన సర్వేయర్ల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేపట్టారు. 437 మందికి గాను 402 మంది సర్వేయర్లు శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు.

తెలంగాణ గానకోకిల బెల్లి లలితకు నివాళి



లలిత చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

రాజేంద్రనగర్: తెలంగాణ మలిదశ ఉద్యమకారిణి, తెలంగాణ గాన కోకిల బెల్లి లలిత వర్ధంతి సందర్భంగా రాజేంద్రనగర్ చౌరస్తా డాక్టర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద సోమవారం ఆమెకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త గుబ్బంపల్లి శామల్ రాజ్ మాట్లాడుతూ... స్పిన్నింగ్ మిల్లులో కార్మికురాలిగా పని చేస్తూ కార్మికుల సమస్యలపై, తాగే నీటి కోసం, గుట్కా నిషేధించాలని తన పాటలతో ప్రజలను చైతన్యవంతం చేసిన ఉద్యమకారిణిని అని అన్నారు. నేతలు గుబ్బంపల్లి శ్యామల్‌రాజ్, మంత్రి చంద్రశేఖర్, ఎం.మహేశ్, ఎద్దు సుందర్‌రావు, షాబాద్ రవి, మక్తల్ హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణం.. నరకప్రాయం!

బస్ షెల్టర్లు లేక రోడ్లపైనే వేచి ఉంటున్న ప్రయాణికులు

- ఎండకు, వానకు ఇబ్బందులు పడుతున్న వైనం
- షెల్టర్లు ఏర్పాటు చేయడంలో అధికారులు విఫలం



చెట్టు కింద వర్షానికి తడుస్తున్న ప్రయాణికులు

బండ్లగూడ: నిత్యం వివిధ ప్రాంతాలకు ఆర్టీసీ బస్సుల్లో రాకపోకలు సాగించే ప్రయాణికులు వేచి ఉండేందుకు పలు ప్రాంతాల్లో బస్ షెల్టర్లు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఓ వైపు దంచికొడుతున్న ఎండలు.. మరో



బస్సుల కోసం చెట్టు కింద వేచి ఉన్న ప్రయాణికులు

వైపు నిల్చునేందుకు కానరాని బస్టాప్‌లు, ఇంకోవైపు వేళకు రానీ ఆర్టీసీ బస్సులు వెరిసి ప్రయాణికులు అవస్థలకు గురవుతున్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రాంతాల్లో బస్‌షెల్టర్లు కానరావడం లేదు. దీంతో బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికులు రోడ్లపైనే నిల్చొని ఉండాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. ఈ కారణంగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

- బండ్లగూడ, కిస్మత్‌పూర్, ఆరె మైసమ్మ, పీరంచెరువు, సన్‌సిటీ, హైదర్షాకోట్, గంధంగూడ తదితర ప్రాంతాల్లో ఎక్కడ కూడా బస్ షెల్టర్లు లేవు. దీంతో ప్రయాణికులు వర్షానికి తడుస్తూ... వేసవిలో ఎండకు విలవిలలాడుతున్నారు. ప్రస్తుతం నగరంలో విపరీతమైన ఎండ వేడిమి ఉండగా, చెట్ల కింద తలదాల్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంటుంది. ఎన్నో రోజులుగా ప్రయాణికుల సౌకర్యార్థం బస్ షెల్టర్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే బస్‌షెల్టర్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ప్రయాణికులకు తిప్పలు..

బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు ప్రాంతాల నుంచి అనేక మంది ఉద్యోగాలకు, పాఠశాలలకు, కళాశాలలకు వెళ్తుంటారు. ఇక్కడ నుంచి వేలాదిగా ప్రజలు వెళ్తున్నా వారికి సరైన సౌకర్యాలు కల్పించడంలో మాత్రం అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు.

పూర్తిస్థాయిలో అందుబాటులో లేవు..

కొన్ని ప్రాంతాల్లో బస్‌షెల్టర్లు ఉన్నా కూడా అవి పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండటం లేదు. పూర్తిగా పాడవ్వడంతో పాటు శిథిలావస్థకు చేరుకున్నాయి. వీటి కింద తలదాచుకుంటే ఏ ప్రమాదం జరుగుతుందో అని ప్రయాణికులు రోడ్లపైనే నిల్చునే ఉంటున్నారు.

షెల్టర్ ఉన్నచోట ఇలా..



శాస్త్రిపురం: ఇది శాస్త్రిపురం బస్‌షెల్టర్. అక్కడ ప్రయాణికులు కనిపించరు. ఎందుకంటే ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన బస్‌షెల్టర్ వ్యాపారులకు అడ్డగా మారింది. ప్రయాణికులు ఎండకు, వానకు రహదారులపై నిలబడి బస్సుల కోసం వేచి చూస్తుండగా, షెల్టర్‌లో మాత్రం వ్యాపారులు తమ వ్యాపార కార్యకలపాలను చేసుకుంటున్నారు. ప్రయాణికులు ప్రశ్నిస్తే నిర్లక్ష్యపు సమాధానాలు చెబుతున్నారని ప్రయాణికులు వాపోతున్నారు. ఎవరికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని సమస్యను సంబంధిత అధికారులు పరిష్కరించి షెల్టర్ ప్రయాణికులకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని శాస్త్రిపురం ప్రజలు కోరుతున్నారు.

కాంగ్రెస్ పాలనలోనే పేదలకు న్యాయం

రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్



లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

మణికొండ: పేదలకు అన్ని రంగాలలో మేలు చేసే ఉద్దేశంతో రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని, ప్రభుత్వం ఇచ్చే పథకాలతో వారంతా లబ్ధిపొందాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. నార్సింగి మున్సిపల్ పరిధిలోని కోకాపేట కమ్యూనిటీ హాల్‌లో సోమవారం ఆయన 238 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ గృహ మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలలో భాగంగా స్థలాలు ఉన్న వారికి ఇందిరమ్మ గృహాలను నిర్మించుకునేందుకు రూ. 5 లక్షలను ప్రభుత్వం ఇవ్వటం శుభపరిణామన్నారు. ఎలాంటి రుణం కాకుండా ఉచితంగా ఇంటి నిర్మాణానికి డబ్బు ఇవ్వటం పేదలకు ఎంతో మేలు చేస్తుందన్నారు. మున్సిపాలిటీ పరిధిలో ఇప్పటి వరకు ఇందిరమ్మ గృహాలు రాని వారు ఉంటే తిరిగి దరఖాస్తు చే సుకోవాలని, వారికి మంజూరయ్యేలా చూస్తామన్నారు. మంజూరైన వారంతా ఆరు నెలల్లోపు ఇళ్లను నిర్మించుకోవాలన్నారు. ప్రభుత్వ నిబంధనలు ఎలా ఉన్నా కొంత మేర సడలింపులు అధికారులు ఇస్తారని, వాటిని ఉపయోగించుకుని ఇంటి స్థలం పెద్దగా ఉన్న వారు అదే స్థాయిలో నిర్మాణం చేసుకోవాలన్నారు. నార్సింగి మున్సిపాలిటీలో అధికారులు ఉత్తమంగా పనిచేస్తున్నారని, వారికి ప్రతి ఒక్కరూ సహకరించి మన వార్డులను మరింతగా అభివృద్ధి చేసుకోవాలన్నారు. పనిచేసే అధికారులను విమర్శించటం మానుకోవాలని సూచించారు. గత 15 నెలల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనేక పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని, వాటితో లబ్ధిపొందిన వారు ఎంతో ఆనందంగా ఉన్నారన్నారు. ముఖ్యమంత్రికి పేదల కష్ట, సుఖాలు తెలుసు కాబట్టే ఇలాంటి పథకాలను వారికి అందిస్తున్నారన్నారు. నార్సింగి మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ టి.మల్లేష్, నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ కె.వేణుగౌడ్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎం.జైపాల్‌రెడ్డి, నార్సింగి మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు కె.అశోక్‌యాదవ్‌లతో పాటు మాజీ కౌన్సిలర్‌లు, నాయకులు పాల్గొన్నారు.

ఆర్టీసీ అధికారులతో ట్రాఫిక్ పోలీసుల చర్చలు

సాక్షి ఎఫెక్ట్..



ఆర్టీసీ రాజేంద్రనగర్ డిపో అధికారులతో చర్చిస్తున్న శంషాబాద్ ట్రాఫిక్ పోలీసులు

శంషాబాద్: శంషాబాద్‌లో జఠిలంగా మారిన ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు ట్రాఫిక్ పోలీసులు చర్యలను ప్రారంభించారు. సోమవారం 'సాక్షి' దినపత్రిలో వచ్చిన శంషాబాద్‌లో ట్రా'ఫికర్' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి శంషాబాద్ ట్రాఫిక్ పోలీసులు స్పదించారు. దీర్ఘకాలికంగా ఉన్న సమస్య ఇటీవల మరింత తీవ్రరూపం దాల్చడానికి గల కారణాలను అన్వేషించారు. ఇందులో భాగంగా బస్టాండ్‌ను సవేరా వద్ద కాకుండా మరో ప్రాంతానికి తరలించేందుకు ఉన్న అవకాశాలపై రాజేంద్రనగర్ ఆర్టీసీ డిపో అధికారులతో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రమోద్‌కుమార్ చర్చించారు. సమస్య పరిష్కారానికి సమన్వయంతో చర్యలు తీసుకోవాల్సిన అవసరముందని ఆర్టీసీ అధికారులకు వివరించారు. దీనిపై అధ్యయనం చేసి తగిన పరిష్కార మార్గానికి చర్యలు తీసుకోనున్నట్లు అర్‌టీసీ అధికారులు తెలిపారు.

శ్మశానవాటికలో వసతులు కల్పించాలి



డీసీకి వినతిపత్రం ఇస్తున్న నేతలు

మైలార్‌దేవ్‌పల్లి: ప్రజల అవసరాలను గుర్తించి అధికారులు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని బీఆర్‌ఎస్ పార్టీ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్ అన్నారు. సోమవారం సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో డీసీ రవికుమార్‌ను కలిసి పద్మశాలిపురం శ్మశనవాటికలో మౌలిక వసతులు కల్పించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పద్మశాలిపురంలో దాదాపు 40 వేల మంది వరకు జనాభా ఉంటుందన్నారు. శ్మశానవాటికలో మౌలిక సదుపాయాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సరైన ప్రహరీ లేక దొంగలు బోర్‌కి సంబంధించిన స్టాటర్, కరెంటు వైర్లు ఎత్తుకెళ్లారన్నారు. బాత్‌రూమ్‌లు సైతం నిరుపయోగంగా మారుతున్నాయన్నారు. శివరాంపల్లి రైల్వేస్టేషన్ దారి మూసివేయడంతో శివరాంపల్లి, బాబుల్‌రెడ్డినగర్, మోహన్‌రెడ్డినగర్, వడ్డెర బస్తీ, సాయిబాబానగర్, ప్రగతి కాలనీ, కాటేదాన్ పారిశ్రామికవాడ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఉప కమిషనర్ హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. నేతలు రాము, అక్కం రాఘవేందర్‌యాదవ్, రాజేష్‌యాదవ్, ఎడ్లకాడి సూర్యం, ఎస్.అశోక్‌కుమార్, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ముష్కిచెరువులోకి కొత్తనీరు

మణికొండ: అనాదిగా చెరువులోకి వచ్చే వరద కాలువను మూసి వేయటంతో ఆ నీరంగా ఎక్కడికక్కడ నిలిచిపోవటం, లోతట్టు ప్రాంతాలకు వెళ్లిపోయేది. అలాంటి పరిస్థితిని చక్కదిద్దేందుకు ధృవాన్ష్ స్వచ్ఛంద సంస్థ ఆ చెరువును దత్తత తీసుకుని పునరుద్ధరణ పనులు చేపట్టింది. దాంతో సోమవారం మూసుకుపోయిన కాలువలను పునరుద్ధరించే పనులు చేపట్టడంతో గోతులలో నిలిచిన వర్షం నీరంతా చెరువులోకి వస్తుంది. మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల సరిహద్దులో ఉన్న ముష్కి చెరువులోకి వర్షం నీరు వచ్చే నాలాలు దశాబ్దాలుగా మూసుకుపోయాయి. దాంతో చుట్టుపక్కల వచ్చిన అపార్ట్‌మెంట్‌లు, గేటెడ్ కమ్యూనిటీల మురుగునీరు వచ్చి అందులో చేరుతుంది. దాంతో చెరువు నుంచి దుర్గంధం వెదజల్లటం, చేపలు, ఇతర జీవులు మరణించాయి. చెరువుకు పూర్వ వైభవం తేవాలనే ఉద్దేశంతో గతంలో మణికొండ మున్సిపాలిటీ నుంచి నిధులను వెచ్చించి సుందరీకరణ పనులు చేపట్టారు. అవి సత్ఫలితాలు ఇవ్వక పోవటంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో ధృవాన్ష్ సంస్థకు సుందరీకరణ పనులను అప్పగించారు. దాంతో నాలాలు పునరుద్ధరించే పనలను సోమవారం నుంచి మొదలు పెట్టారు. కొద్ది నెలల్లోనే చెరువు రూపురేఖలు మార్చి జీవరాశులకు నిలయంగా మారుస్తామని ధృవాన్ష్ సంస్థ వ్యవస్థాపకురాలు మధులిక తెలిపారు.





నాలాను పునరుద్ధరిస్తున్న దృశ్యం.. చెరువులోకి వస్తున్న వరద నీరు

రైతులకు ఆధునిక పరిజ్ఞానంపై అవగాహన



రైతులకు అవగాహన కల్పించిన శాస్త్రవేత్తలు

శంషాబాద్ రూరల్: రైతులు వ్యవసాయంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంచుకోవాలని వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త డాక్టర్ సుకృత్ కుమార్ సూచించారు. 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని రామంజాపూర్‌లో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. పరిమితికి మించి యూరియా వినియోగంతో కలిగే అనర్థాలను వివరించారు. ఎరువుల యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.జి.మహాదేవప్ప, ఎంఈఓ శ్వేత, ఎంఈఓ కె.సురేష్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

అసలు సిసలైన స్వాతంత్ర్య సమరయోధుడు వీర్ సావర్కర్

గోల్కొండ: వినాయక్ దామోదర్ సావర్కర్ అసలు సిసలైన భారత స్వాతంత్ర్య సమరయోధుడని గోల్కొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు పి.ఉమామహేందర్ అన్నారు. కార్వాన్ వీర్ సావర్కర్ అసోసియేషన్ ప్రతినిధులు సోమవారం ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఆయన ఈనెల 28న జరగనున్న వీర్ సావర్కర్ జయంతి వేడుకల కరపత్రం, ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. 28న గుడిమల్కాపూర్‌లోని శ్రీకృష్ణ భవన్‌లో జరిగే జయంతి వేడుకలకు రావాల్సిందిగా ఆయనను కోరారు.ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు జొన్నకుంటి మధుసూదన్, గోదా లక్ష్మీకాంత్‌యాదవ్, సద్గురు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రాజేంద్రనగర్‌లో భారీ వర్షం

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దాదాపు అర గంట పాటు కురిసిన వర్షానికి ప్రధాన రహదారులతో పాటు అంతర్గత బస్తీల్లో వరదనీరు ఏరులై పారాయి. ప్రధానంగా ఆరాంఘర్ రైల్వే బ్రిడ్జి, మైలార్‌దేవ్‌పల్లి, బుద్వేల్ అండర్ గ్రౌండ్ బ్రిడ్జి, గగన్‌పహాడ్, యూనివర్సిటీ రోడ్డు, ఉప్పర్‌పల్లి, శివరాంపల్లి, హైదర్‌గూడ, అత్తాపూర్, రాజేంద్రనగర్, ఎన్‌ఐఆర్‌డీ, బుద్వేల్, నేషనల్ పోలీసు అకాడమీ ప్రాంతాల్లోని రహదారులపై వరదనీరు నిలిచిపోయింది. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. వరదనీరు తగ్గుముఖం పట్టిన అనంతరం వాహనాల రాకపోకలు సాఫీగా సాగాయి. గత ఐదారు రోజులుగా కురుస్తున్న వర్షానికి కొన్ని ప్రాంతాల్లో వరదనీరు నిలిచిపోవడంతో స్థానికులు, వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయంలో జీహెచ్‌ఎంసీ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నకిలీ ఆస్పత్రుల గుర్తింపు

సాక్షి, సిటీబ్యూరో: వైద్యార్హత లేకపోయినా, అర్హులైన డాక్టర్లు ఉన్నట్లు బోర్డులు పెట్టి, అర్హత లేని వారు వైద్యం చేస్తున్నట్లు గుర్తించిన మూడు కేంద్రాలను అధికారులు గుర్తించారు. రాజేంద్రనగర్ పరిధిలోని కాటేదాన్‌లో గాయత్రి ఫస్ట్ ఎయిడ్ సెంటర్ (పరమేశ్వర్), ప్రకాశ్ క్లినిక్ (ప్రకాశ్), లక్ష్మి క్లినిక్ (చాహల్) లలో ఈ తతంగం జరుగుతున్నట్లు గుర్తించారు. అర్హత లేకున్నా చట్టవిరుద్ధంగా పెయిన కిల్లర్లు, స్టెరాయిడ్లు, యాంటీబయాటిక్ ఇంజెక్షన్లు ఇస్తున్న చాహల్‌పై కేసులు నమోదు చేసినట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

అదనపు అంతస్తులు కూల్చివేత



మణికొండ: అనుమతలకన్నా అధికంగా నిర్మించిన అంతస్తులపై మణికొండ మున్సిపాలిటీ అధికారులు కొరడా ఝులిపించారు. మున్సిపాలిటీ పరిధిలోని పంచవటి కాలనీలో ఓ బిల్డర్ జీ ప్లస్ నాలుగు అంతస్తులకు అనుమతులు తీసుకుని ఏకంగా ఆరు అంతస్తులు నిర్మిస్తున్నారు. రెండు సార్లు నోటీసులు ఇచ్చినా పట్టించుకోకపోవటంతో సోమవారం మున్సిపల్ కమిషనర్ డి. ప్రదీప్‌కుమార్ ఆదేశాలతో టౌన్‌ప్లానింగ్ అధికారి సంతోష్‌సింగ్ రెండు అంతస్తుల స్లాబ్‌లను కట్ చేసి కూల్చివేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తీసుకున్న అనుమతుల మేరకే నిర్మాణాలు చేపట్టాలన్నారు. అదనంగా నిర్మించిన సెట్‌బ్యాక్‌లు లేక పోయినా చర్యలు తప్పవన్నారు. రాబోయే రోజుల్లో చర్యలు తీసుకునేందుకు మరి కొన్ని భవనాలను గుర్తించామని, వాటిపైనా చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

పార్కు స్థలాన్ని కాపాడాలని వినతి

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ గ్రీన్‌సిటీ కాలనీలోని పార్కు స్థలంలో చేపడుతున్న నిర్మాణాన్ని వెంటనే ఆపి పార్కు స్థలాన్ని కాపాడాలని కోరుతూ సోమవారం రాజేంద్రనగర్ నియోజకవర్గం బీజేపై ఎం ప్రధాన కార్యదర్శి మాగాని శివ దక్షిణ మండలం జోనల్ కమిషనర్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌లకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా రాజేంద్రనగర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... బుద్వేల్‌లోని పంట పొలాల్లో గతంలో గ్రీన్‌సిటీ, న్యూ గ్రీన్ సిటీ పేరిట ప్లాట్లుగా చేసి విక్రయించారన్నారు. ఈ కాలనీలో స్థానికుల అవసరాల కోసం 3,800 గజాల స్థలాన్ని పార్కులు, గ్రంథాలయం, ఇతర అవసరాల కోసం వదిలేశారన్నారు. ప్రస్తుతం పార్కుకు కేటాయించిన 500 గజాల స్థలంలో ఒక వ్యక్తి నిర్మాణాన్ని ప్రారంభించారని ఆరోపించారు. కాలనీవాసులు జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశారని.. అయినా పనులు సాగుతున్నాయన్నారు. ఆ స్థలాన్ని కాపాడి స్థానిక ప్రయోజనార్థం పార్కును ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు.

వ్యక్తి అదృశ్యం



రమేష్

అత్తాపూర్: అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. మహిళా ఎస్‌ఐ పార్వతియాదవ్ సమాచారం మేరకు... శివరాంపల్లి వీకర్ సెక్షన్ కాలనీలో ఉంటున్న కె.రమేష్(55) స్థానికంగా ఉన్న ఓ బార్బర్ షాపులో పని చేస్తున్నాడు. ఆ వృత్తిలో ఆశించిన స్థాయిలో ఆదాయం లేకపోవడంతో కుటుంబ పోషణ ఇబ్బందిగా మారింది. దీంతో మానసికంగా కుంగిపోయిన రమేష్ మానసిక స్థితి సరిగా లేనందున ఎర్రగడ్డ మానసిక ఆరోగ్య కేంద్రంలో భార్య గోవిందమ్మ చూపించింది. ఈ క్రమంలో రమేష్ ఈ నెల 21వ తేదీన ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఆందోళనకు గురైన భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని మహిళా ఎస్‌ఐ వివరించారు.

'ప్రజావాణి'కి తగ్గిన ఆదరణ

50 శాతం ఫిర్యాదులే పరిష్కారం

- ఫిర్యాదు చేసేందుకు ఆసక్తిచూపని ప్రజానీకం
- ప్రహసనంగా మారుతున్న 'ప్రజావాణి'
- అధికారుల తీరుపై సర్వత్రా నిరసనలు



ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న గగన్‌పహాడ్‌వాసులు

రాజేంద్రనగర్: ప్రజావాణి కార్యక్రమంలో అందిన ఫిర్యాదుల్లో 50 శాతం ఫిర్యాదులను పరిష్కరిస్తున్నారు. దీంతో ప్రజావాణి కార్యక్రమానికి అంతగా స్పందన లభించడం లేదు. చిన్నపాటి సమస్యలను అధికారులు పరిష్కరిస్తున్నారు తప్పా... దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను పరిష్కరించడం లేదని ప్రజావాణికి వస్తున్న వారు వెల్లడిస్తున్నారు. మరమ్మతులు సైతం నిర్వహించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ప్రజల సౌకర్యార్థం 2024 జనవరి 8వ తేదీన ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాజేంద్రనగర్, మైలార్‌దేవ్‌పల్లి, శాస్త్రిపురం, సులేమాన్‌నగర్, అత్తాపూర్ డివిజన్ల పరిధిలోని ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఈ ప్రజావాణి కార్యక్రమానికి హాజరై ఫిర్యాదు చేయాలని అధికారులు ప్రకటించారు. దీంతో మొదట ప్రతి సోమవారం నిర్వహించే ఈ కార్యక్రమానికి స్పందన బాగానే వచ్చింది. కానీ సమస్యల పరిష్కారం అంతగా లేకపోవడంతో ఫిర్యాదు చేసేందుకు ప్రజలు ఆసక్తి చూపడం లేదు. ఎక్కువగా వీధి దీపాలు, పారిశుద్ధ్యం, అక్రమ కట్టడాలపైనే ఈ ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదులు అందుతున్నాయి. వీధి దీపాల నిర్వాహణ పూర్తిగా సంబంధిత కాంట్రాక్టర్ నిర్వహించకపోవడంతో ఫిర్యాదులు స్వీకరించడం తప్పా అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. దీంతో ఫిర్యాదు చేసిన వారు ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదు చేసినా తమకు ఫలితం లేదంటూ ఆరోపిస్తున్నారు. పారిశుద్ధ్య నిర్వాహణపై ఫిర్యాదు చేయగా ఫిర్యాదు అందిన వెంటనే స్పందించడం అనంతరం పట్టించుకోకపోవడంతో సమస్య పునరావృతం అవుతుందని స్థానికులు వెల్లడిస్తున్నారు. రోడ్లపై నిర్మాణాలు, అక్రమ నిర్మాణాలు, అనుమతులు లేని షెడ్లు తదితర వాటిపై ఫిర్యాదు చేసినా సంబంధిత శాఖ అధికారి కానీ, సిబ్బంది కానీ పట్టించుకున్న దాఖలాలు లేవని ఫిర్యాదుదారులు తెలుపుతున్నారు. ఐదు డివిజన్లకు గాను ఒకే ఒక్క సెక్షన్ అధికారి ఉండటం ... సిబ్బంది కొరత ఉండటంతో టౌన్ ప్లానింగ్ అధికారి ఫిర్యాదు వచ్చినా... చేసేది లేక కార్యాలయానికే పరిమితం అవుతున్నారు. ఇలా ప్రజావాణిపై సర్కిల్ ప్రజలకు నమ్మకం సడలింది. దీంతో ఫిర్యాదులు చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. 2024 జనవరిలో ప్రారంభించిన ప్రజావాణి కార్యక్రమానికి ఇప్పటి వరకు 150 ఫిర్యాదులు అందాయి. వీటిలో 75 ఫిర్యాదులను పరిష్కరించారు. మిగిలిన 75 ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టారు. అత్యధికంగా ఇంజనీరింగ్ విభాగానికి ఫిర్యాదులు అందగా.. అధికారులు ఆలసత్వం కారణంగా కేవలం 12 సమస్యలకు మాత్రమే పరిష్కారం దొరికింది. ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి ఏ ఫిర్యాదు అందినా డబ్బుతో కూడుకొని ఉందని... నిధులు లేవని.. కాంట్రాక్టర్ ముందుకు రావడం లేదంటూ అధికారులు సమస్యలు పక్కన పెడుతున్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9989616273
9010221230